వార్త

మీలో మార్పు రావడం అన్నది ఎంత కఠినమైన విషయమో తెలుసుకోండి. అప్పుడు ఇతరుల్ని మార్చడం అన్నది ఎంత కష్టమైనదో మీకు తెలిసొస్తుంది.

- జాకబ్ బ్రౌడీ

## వామపక్షాలు కనుమరుగు!

దేశంలో వామపక్ష రాజకీయాలకు తుది ఆశలు అడియాసలయ్యాయి. ఒకప్పుడు 1980 దశకంలో త్రిపుర, పశ్చిమబెంగాల్, కేరళం రాష్ట్రాలలో వామపక్షాల నేతృత్వంలోని ప్రభుత్వాలే బలంగా ఉండేవి. అంటే అక్కడి ప్రజానీకం వామపక్ష భావజాలం పట్ల ఆకర్షితులై ఈ దేశంలో ఏ వర్గానికైనా మంచి జరిగితే వారి ద్వారానే జరుగుతుందని ప్రగాఢ విశ్వాసంతో ఉండేవారు. కానీ రానురాను ఆ పార్టీ పాలనపై ఉన్న నమ్మకాలు సడలిపోయాయి. వామపక్ష ఉద్యమాలలో అత్యధికులు పాల్గొనడం మానేసారు. మొదట్లో ఎలా ఉన్నా వారిలో కూడా రాజకీయ ఆకాంక్షలు పెచ్చుపెరిగి, ఇతరత్రా పుట్టిన ప్రజాకర్షక పార్టీలలో జతకట్టి ఎలాగైనా చట్టసభలకు వెళ్లాలనే తాపత్రయం పెరిగింది. ఆయా పార్టీల ఆలోచనలు,మారుతున్న స్వభావాల రీత్యా వామపక్ష భావజాలానికి ఆ పార్టీ కార్యకర్తలే దూరమయిన పరిస్థితులున్నాయి. అంతేకాదు రైట్ పార్టీల సాంగత్యంలో లెఫ్ట్ పార్టీ కార్యకర్తల ఆలోచనలు కూడా మారిపోయాయి. ఎన్నికల్లో ఏ ఇతర రైట్ పార్టీలతో జతకట్టాల్సి వచ్చినా రాజకీయ సీట్ల బేరసారాలతో 'పొత్తులు' కలిసేవి. లేకుంటే ఎవరికి వారే యమునా తీరేగా ఉండిపోయేవి. రాజకీయ పొత్తుల చర్చల నేపథ్యంలోనే వారి మధ్య సైద్ధాంతిక విబేధాలను పక్కన బెట్టి 'సీట్లు'అంకెల ప్రాతిపదికగా మమేకమవడంతో ప్రజల్లో వామపక్షాల పట్ల నిరాసక్తత బయలుదేరింది. పశ్చిమబెంగాల్లో శ్రామిక వర్గ విస్తృత ప్రయోజనాలు కాపాడే పార్టీగా వర్ధిల్లిన కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జ్యోతిబసు, బుద్ధదేవ్ భట్టాచార్య అనంతరం అధికారం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అప్పట్లో మమతా బెనర్జీ దూకుడుకు వామపక్ష ప్రభుత్వం నేల కూలింది. ఆ తర్వాత గత 15 ఏళ్లుగా చెప్పుకోదగిన స్థానాలు దక్కించుకోలేకపోయింది. బెంగాల్‌లో సిపిఎం 33 ఏళ్లపాటు రాజ్యాధికారంలో ఉంది. తాజా ఎన్నికలలో 27 స్థానాల్లో పోటీ చేయగా కేవలం 2స్థానాలకే వామపక్ష పార్టీలు సరిపెట్టుకోవాల్సి వచ్చింది. త్రిపురలో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం పాలన చేశాయి. 1993 నుంచి 2018 వరకు పాతికేండ్ల ఆ రాష్ట్రాన్ని వామపక్షాలు పాలించాయి. 20ఏళ్ల పాటు మాణిక్ సర్కార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత కాలంలో బిజెపి త్రిపురలో ప్రభుత్వ మార్పును ఆహ్వానించే స్థాయిలో కృషి చేసి పాలనాపగ్గాలు తీసుకుంది. దేశంలో ఎక్కడైనా వామపక్ష పాలనను మార్చగలమన్న ధోరణికి ఆ ఎన్నికల్లోనే అంకురార్పణ జరిగింది. ఆ తర్వాతనే బిజెపి ప్రతిరాష్ట్రంలోనూ తమ ప్రభుత్వమే ఉండాలని వ్యూహాలు పన్నింది. కేరళంలో లెఫ్ట్ ప్రభుత్వం (ఎల్‌డిఎఫ్) నేటివరకు పదేళ్ల పరిపాలించింది. తాజా ఎన్నికలలో ఎల్‌డిఎఫ్‌కు పరాభవం ఎదురైంది. కేరళలో వామపక్ష కూటమి ఓటమితో దేశంలో అధికారంలో ఉన్న ఒక్కగానొక్క రాష్ట్రం కూడా కోల్పోయింది. ఐదుదశాబ్దాల వామపక్ష చరిత్రలో గెలిచిన స్థానాలు తగ్గిపోతూ వస్తున్నాయి. 140 స్థానాలున్న కేరళంలో సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ 35 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. యుడిఎఫ్ వేవ్‌లో 13 మంది కేబినెట్ మంత్రులు ఓడిపోయారు. కేరళలో వామపక్ష కూటమి ప్రభుత్వం అవినీతి, బంధుప్రీతికి వ్యతిరేకంగా జనం ఓటు వేసారనే ప్రస్తావనలున్నాయి. 1977 తరువాత దేశంలో కమ్యూనిస్టులు అధికారంలో లేకపోవడం ఇదే ప్రథమం. కేరళలో ప్రతి ఐదేండ్లకోసారి ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ ప్రభుత్వాలను మార్చుకుంటుంటాయి. కానీ గతఎన్నికలో అలాంటిదేమీ జరుగలేదు. వరుసగా రెండోసారి గెలిచింది. ఈసారి మాత్రం హ్యాట్రిక్ కొట్టే అవకాశం కోల్పోయింది. గత ఎన్నికల తర్వాత కేరళలో అవినీతి, బంధుప్రీతి పెరిగిపోతున్నా సిఎం పినరయి విజయన్ పట్టించుకోలేదు. పైగా శబరిమల మహిళా భక్తులు ప్రవేశం వంటి అంశాల్లో పాత సంప్రదాయాలను నమ్మకాలను పక్కన బెట్టడంతో బెంగాల్‌లో మార్క్సిస్టులకు చుక్కెదురైంది. ప్రపంచంలోనే ప్రజాస్వామిక ఎన్నికల ద్వారా 1957లో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలు తొలిసారి అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించిన విషయం విదితమే. అంతకు ముందే 1951-52లో మొదటి లోక్‌సభ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అధిక స్థానాలు కైవసం చేసుకున్నాయి. అప్పట్నించి ఎన్ని ఎన్నికలు వచ్చినా ప్రజల కోసమే తామున్నట్లు భరోసా ఉండేది. ప్రాంతీయ పార్టీల రాకతో వాటితో మమేకమై కమ్యూనిస్టు పార్టీలు తమ ప్రాభవం కోల్పోయామన్న అభిప్రాయాలు ప్రజాబాహుళ్యం నుంచి వినిపిస్తుంటాయి. వామపక్ష పార్టీలు ఎంతో బలంగా ఉద్యమాలు రూపొందించి ప్రజాప్రయోజనాల కోసం పాటుపడ్తారన్నపేరున్నా రెండు మూడు ప్రధానసందర్భాల్లో తమ రాజకీయ తప్పిదాలను ఒప్పుకున్నాయి. 1996లో ప్రధాని పదవికి పార్టీ అగ్రనేత జ్యోతిబసు పేరు ప్రతిపాదనకొచ్చినా పార్టీ పొలిట్ బ్యూరో వ్యతిరేకించింది. ఆ నిర్ణయం తమ చారిత్రిక తప్పిదంగా ఒప్పుకుంది. అంతకుముందు ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో అత్యయిక స్థితి అంశంపై కొన్ని వామపక్షాలు బలపరిచాయి. ఆ తర్వాత తమ చారిత్రక తప్పిదంగా అంగీకరించాయి. ఇలాంటి అంశాల నేపథ్యంలో వామపక్ష భావన ప్రజలకు మధ్య అంతరం మొదలైంది. 2014లో దేశవ్యాప్తంగా కాషాయిఅనుకూల పవనాలకే త్రిపురలో కమ్యూనిస్టు పాలనకు చరమ గీతం పాడారని భావన. కానీ నేటి కేరళం వామపక్ష రాజకీయాలు మాత్రం అవినీతి ముసుగులో కొట్టుకుపోయినట్లు భావించాలి. అలా పశ్చిమబెంగాల్, త్రిపురలలో వామపక్ష భావనలకు తిలోదకాలిచ్చి ఆ పార్టీ వెలవెలబోయే స్థాయికి తెచ్చారన్నది రాజకీయ భావన.



ఘర్షణల వల్ల శక్తి వృథా అవుతుంది. హెచ్చుతగ్గులు వస్తాయి. ఆందోళనలు చెలరేగుతాయి. అశాంతి కలుగుతుంది.

వి.జాన్సన్



విశ్వాసం అనేది కొద్దిపాటి గాలికి వాలిపోయేది కాదు. అది అచంచలమైనది. హిమాలయాల అంత స్థిరమైనది.

మహాత్మా గాంధీ

# ‘కృషితో నాస్తి దుర్భిక్ష’మే సత్యం

**ఉద్యోగాలు పోయాయని నిర్వేదన చెందకుండా ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో కష్టపడితే దిగులనేది పడాల్సిన అవసరమేలేదు. 'కష్టే ఫలీ'అన్న సిద్ధాంతం లక్ష్య సాధనలో మార్గం సుగమం చేస్తుంది. ఐ.టి బదులు ఏఐ చాన్నాళ్ల రాజ్యమేలుతుంది. ఒకప్పుడు గ్రామాలలో రైతే రాజుగా ఉన్నాడు. ఇప్పుడు అదే రైతు కాడె బదులు ట్రాక్టర్ నడుపుతూ రాజుగానే ఉన్నాడు. ఐఏయస్ ఫెయిల్ అయిన వ్యక్తి కసిగా అధ్యయనంతో పట్టుసాధించి ఐఎయస్ లాంటి ఉద్యోగాలకోసం ప్రయత్నం చేసే వారికి పాఠాలు చెవుతూ స్టడీసర్కిల్స్ స్థాపించి లెక్కకుమించిన ఉన్నతోద్యోగులకు మార్గదర్శిగా మారాడు. అందుకే 'కృషితో నాస్తిదుర్భిక్షం' అన్నది కాలం చెల్లిన సిద్ధాంతం కాదు! దానికి ఎక్స్ పైరీ డేట్ లేదు.**



రావులపాటి సీతారాం రావు

ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన 'ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ' ప్రస్తుతం వన్నె తరుగుతున్న దశలోఉంది. ఐ.టి అన్న రెండు అక్షరాలు కాలేజీ దశకు చేరిన విద్యార్థులకు వెలుగు దీపాలుగా మారాయి. అర్జెంట్‌గా బి.ఇ డిగ్రీ కంప్యూటర్స్‌లో తీసుకోవటం అమెరికాకు బిస్తర్ సర్దుకోవటం ఇండియాలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో నిన్నమొన్నటి వరకూ వారికి నిత్యకృత్యంగా మారింది. అమెరికాకు చేరుకున్న యువత, భారతదేశంలోని తల్లిదండ్రులను అచిరకాలంలోనే ధనవంతులను చేసింది. మామూలు చొక్కాలూ, గళ్లలుంగీల నుంచి అమెరికా ప్రయాణానికి టీషర్ట్‌లూ, జీన్‌పాంట్లతో వారి తండ్రులూ, చీరెలు దేశంలో వదిలేసి మోడ్రన్ వేర్‌తో వారి తల్లులూ సంవత్సరానికి ఒకసారైనా విదేశీ ప్రయాణం విమానాల్లో చేస్తూ కొత్త హోదాను అనుభవిస్తూ 'హాయి, హాయ్'లు కూడా నేర్చుకొని, ఆవిధమైన అదృష్టాన్ని పొందని వారికి అసూయ అమితంగా కలిగేట్లు చేశారు. మావాడు ఐఎఎస్, మా అమ్మాయి ఐపియస్ అన్న మాటలు వదిలేసి అమెరికాలో మావాడు ఐటి కంపెనీ వైస్ ప్రసిడెంట్, మా అమ్మాయి అమెరికాలో కంపెనీ ఎండి తెలుసా అనేస్థితికి చేరుకున్నారు. ప్రస్తుతం అలాంటి కలలు కన్న తల్లిదండ్రులు నీరు కారేట్లు చేసిన 'యుద్ధం' ఎ.ఐ అన్న పదాలు మన దేశాన్నే కాదు అన్ని దేశాలనూ ఊపేస్తున్నాయి. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అన్న (తెలుగులో కృత్రిమ మేధస్సు అనొచ్చునేమో) పదం ఐటి విద్యలో ఉత్తీర్ణులవుతున్న వారిని భవిష్యత్తు గురించి ఆలోచించేట్లు చేస్తున్నది. 'రోబో' సినిమా చూసిన వారు త్వరలోనే అన్ని సౌకర్యాలు సమకూర్చే సాధనాలు వస్తున్నాయని సంబరపడ్డారు కానీ గ్లోబల్‌గా నిరుద్యోగుల సంఖ్య పెంచే పరిణామాలు రాబోతున్నాయని ఊహించలేకపోయారు.'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అన్నపదాన్ని వాడుక భాషలో ప్రస్తావించినప్పుడు అందరూ ఉత్సాహభరితులయ్యారు! సినిమాల్లో గ్రాఫిక్స్, మార్ఫింగ్ లాంటివి నిజ జీవితాల్లో చేస్తున్న హడావిడి, హంగామాను సోషల్ మీడియా బహుళప్రచారం చేసినప్పుడు 'ఆహా ఓహో' అన్నారు. ప్రస్తుతం పరిస్థితులు కలలో కూడా ఊహించని రీతిలో ముఖ్యంగా ఐ.టి విద్యతో వెలిగిపోతున్న ఉద్యోగస్థులను అమెరికా,ఇరాన్ యుద్ధం ఎ.ఐ నడివీధులో పడేట్లుచేశాయి. విదేశాలలో బంగారు కలలను తాపటం చేసుకొని జీవిస్తున్న వారి బతుకులను బుగ్గిపాలు చేశాయని కొందరు అంటుంటే చాలా మంది నమ్మలేదు. కానీ క్యాలుకట్టి పెద్దపెద్ద కంపెనీలలోని ఉద్యోగస్థులు కూడా నిరుద్యోగులై, తమ దేశాలకు తిరిగి వెళ్లిపూలమ్మిన చోటనే కట్టెలమ్ముకొనే పరిస్థితి వచ్చిందా అని వాపోతూ తిరుగు ప్రయాణాలు కట్టుంటే నిజం సుమా? ఈదుర్భర పరిస్థితి ఎంతకాలం ఉంటుంది అని బాధపడే వారి పరిస్థితి వర్ణనాతీతం. పరిస్థితులు ప్రస్తుతం నిరుత్సాహంగా ఉన్నా కొత్త జీవన విధానాన్ని అలవర్చుకొని కష్టాలను దాటొచ్చు అన్న ఆలోచనను క్రమంగా పెంచుకో



వాలి! మధ్యతరగతి వారి జీవన శైలినీ,వారు చేసేవృత్తులూ చేతిపనులూ ఇతరులకు సహాయపడుతూ ఆర్థిక వనరులను ఏర్పరుచుకొనే విధానాలనూ అధ్యయనం చేసి స్వయంగా ఉపాధులను ఏవిధంగా ఏర్పరుచుకోవాలన్న అంశంపై అవగాహన పెంచుకోకతప్పదు. భవిష్యత్తును గురించి బెంగపడవల్సిన అవసరం.ఐటి ఉద్యోగస్థులతో సహా అందరినీ కార్యోన్ముఖులను చేయాల్సిన కార్యక్రమం ప్రభుత్వాలూ, ప్రజలూ అధికారులు తలపెట్టకతప్పదు. మధ్యతరగతి భారతీయులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాక మరో రెండు సమస్యలు ఇంటి ఖర్చుల అప్పులు, ఉద్యోగాల అస్థిరతను ఎదుర్కొంటున్నారు. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విషయానికి వస్తే 100మిలియన్ల ఉద్యోగాలు వచ్చే అయిదు సంవత్సరాలలో ఎ.ఐ వల్ల కొత్తగా వచ్చే అవకాశాలు భారతదేశంలో ఉన్నాయన్న అంశం మరిచిపోకూడదు. దానివల్ల ఈ మధ్య కాలంలో కలిగిన కష్టాలు దూరమయ్యే అవకాశంఉంది. వైట్ కాలర్ ఉద్యోగాలు దాదాపు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని ప్రస్తుతం భారతదేశంలో భావిస్తున్నారు. ఒక మంచి డిగ్రీతో 20 సంవత్సరాలు ప్రమోషన్లు పొంది జీవితాలను నందనవనంగా మార్చుకోవచ్చు అన్న పద్ధతికి మాత్రం తిలోదకాలు ఇవ్వక తప్పదు. ఐ.టి చదివిన వారిలో కూడా అంతకుముందు 30,40శాతం మంది నిరుద్యోగులు ఉన్నారన్న సంగతి మననం చేసుకోవాలి. గ్రామ సీమలలో నుంచి ఉద్యోగాల కోసంపెద్దగా చదువుకొనివారు,అసలు చదువుకోనివారు కూడా పట్టణాలకు తరలివస్తున్నారు. దానివల్ల వ్యవసాయపనులు చేసేవారు గ్రామాలలో అందుబాటులో లేకుండాపోయారు. అంతేకాకుండా కేంద్రప్రభుత్వం పని పథకం అని రాష్ట్రాలు సంక్షేమపథకాలని ఉచితాలు అందుబాటులోకి తేవటంతో నాలుగు నెలలపాటు పనిచేస్తే సంవత్సరంలో ఎక్కువ భాగం పనిచేయకుండా హాయిగా కాలం గడపొచ్చనే భావన వ్యాపించింది. నిజానికి చదువుకున్న వారు కూడా, వారికి ఆస్థిపాస్తులు కొద్దోగొప్పోఉంటే ఐటిఉద్యోగాల పేరుతో విదేశాలకు ఎగబడకుండా గ్రామాల్లో సేద్యంతో నూతన, ఆధునిక విధానాలతో వ్యవసాయం చేసి ఎక్కువ దిగుబడి సాధించి తమకే కాకుండా ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు ఈమధ్యన అమెరికా నుంచి తిరిగి వచ్చిన వారు తాముగ్రామాల్లో ఏవిధంగా వ్యవసాయ ఉత్పత్తులు పెంచటంతోపాటు తమ జీవన విధానాన్ని కూడా అమెరికాలో కంటే ఎక్కువగా మెరుగుపర్చుకోగలిగామని చెబుతున్నారు.అంతేకాదు ఐటి చదివినవారు ఎ.ఐ మెళకువలు తెలుసుకొని, అధ్యయనం చేయగలిగితే ఆవిభాగంలో కూడా నిష్ణాతులై ఉన్నతస్థితిని చేరుకోవచ్చు. ఒకటి అందుబాటులో ఉంటే మరొకటి పాతదై కనుమరుగవుతుందని నిరాశకులోనవటం సరికాదు. పాత నీరు పోతే కొత్తనీరు ప్రవహించక తప్పదు. రాజులుపోయారు కానీ రాజ్యాలున్నాయి. రాజ్యాధికారం ప్రజాస్వామ్య పద్ధతులలో రాజకీయ నాయకులు ప్రజలచేత ఎన్నుకోబడి పరిపాలన సాగిస్తున్నారు కదా! ఉద్యోగాలు పోయాయని నిర్వేదన చెందకుండా ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో కష్టపడితే దిగులనేది పడాల్సిన అవసరమేలేదు. 'కష్టే ఫలీ'అన్న సిద్ధాంతం లక్ష్య సాధనలో మార్గం సుగమం చేస్తుంది. ఐ.టి బదులు ఏఐ చాన్నాళ్ల రాజ్యమేలుతుంది. ఒకప్పుడు గ్రామాలలో రైతే రాజుగా ఉన్నాడు.ఇప్పుడు అదే రైతు కాడె బదులు ట్రాక్టర్ నడుపుతూ రాజుగానే ఉన్నాడు. ఐఏయస్ ఫెయిల్ అయిన వ్యక్తి కసిగా అధ్యయనంతో పట్టుసాధించి ఐఎయస్ లాంటి ఉద్యోగాలకోసం ప్రయత్నం చేసేవారికిపాఠాలు చెపుతూ స్టడీ సర్కిల్స్ స్థాపించి లెక్కకుమించిన ఉన్నతోద్యోగులకు మార్గదర్శిగా మారాడు. అందుకే 'కృషితో నాస్తిదుర్భిక్షం' అన్నది కాలంచెల్లిన సిద్ధాంతం కాదు!దానికి ఎక్స్ పైరీ డేట్‌లేదు. •

## జంతువుల హక్కులను పరిరక్షించాలి

రామ కిష్టయ్య సంగన భట్ల

మానవులకు పెంపుడు జంతువులు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తున్నాయి. కొద్దిపాటి ప్రేమాభిమానాలకు, సంరక్షణకే పెంపుడు జంతువులు ప్రేమను, విశ్వాసాన్ని కలిగి ఉంటాయి. పెంచే వారినే సర్వస్వంగా భావిస్తాయి. అవి మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలుగజేస్తు, కుటుంబంలో సభ్యులుగా మారి చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి. ఒక రకంగా వ్యాయామాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నాయి. భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం ధృవపరుస్తున్నది. జంతువుల పట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాథమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది. కుక్క, పిల్లి, చేపలు, పక్షులుఏవైనా మనం పెంచే మూగజీవాలను ప్రేమగా చూసుకోవాలి.వాటికి అధికంగా స్వేచ్ఛ కల్పించాలి. విశాలమైన తిరుగాడే సౌకర్యాన్ని కలిగించాలి. పెంపకంలో జాగ్రత్తలు తీసుకుని, వాటిని సంతోషంగా ఉంచుతూ మచ్చిక చేసుకోవాలి. పెంపుడు జంతువుల నివాస, తిరుగాడే స్థలాలను, ఉపయోగించే వస్తువులను శుభ్రపరచాలి.వాటిని కూడా పరిశుభ్రంగాఉంచుకోవాలి. జంతువులకు ముందు జాగ్రత్తగా టీకామందులు వేయించడం, నిర్లక్ష్యం వహించక, క్రమం తప్పకుండా వాటిని పశు వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళడం విధిగా చేయాలి. జంతువుల పట్ల ప్రేమ, ముద్దు మురిపాలు పరిమితులు దాటరాదు. కానీ వాటితో మూతులు, ముక్కులు నాకించుకోవడం, అస్తమానం అంటిపెట్టుకుని ఉండడం మంచిది కాదు.కొన్ని చోట్ల పెంపుడు జంతువుల పట్ల ఎలా మసలుకోవాలనే అంశంపై ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే మాంసం కోసం, వినోదం కోసం కొందరు అనేక రకాలుగా జంతువులకు కష్టనష్టాలు కలిగి



స్తున్నారు. తమ వృత్తులకు, అవసరాలకు జంతువులను ఉపయోగించుకుంటూ వాటిని హింసిస్తున్నారు. ఆవు,మేక, గేదె మొదలైన జంతువులు ఎక్కువ పాలు ఇవ్వడం కోసం, అలాగే కొన్నింటిని పోటీల్లో గెలుపు కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వాటిని హింసిస్తున్నారు. జంతు సంక్షేమానికి సంబంధించి 1960లో పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ్య పూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భారత పార్లమెంటు రూపొందించిన జంతువుల పట్ల క్రూరత్వం నివారణచట్టం సెక్షన్ 11 (1)నుండి (ఓ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించడం లేదా చంపడం వంటి అనేక ఇతర క్రూరచర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిస్తారు.జంతురవాణాలో అనవసర హింసకు పాల్పడే వారికి, జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపే వారికి, జంతువుల కాళ్ళు కట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ.100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు.భారత శిక్షాస్మృతి సెక్షను428, 429కింద జంతువులను భయపెట్టడం,గాయపరచడం చట్టవిరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడాన్ని 1860భారత శిక్షాస్మృతి సెక్షన్ 503ప్రకారం తెలిసి లేదా స్పృహతోచేస్తున్న నేరంగా పరిగణిస్తారు.ఇటువంటి వారిని ఎటువంటి వారంటు లేకుండాఅదుపులోకి తీసుకోవచ్చు. జంతుసంపదను పరిరక్షించడం,వాటిని వృద్ధిచేయడంతో పాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరిబాధ్యత. మానవమనుగడకు అనివార్యమైన పలు ప్రాయోజితాలైన జంతుసంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం,మానవీయ కోణంలో చూడడం,తగిన స్వేచ్ఛకల్పించడం అందరి బాధ్యత.జంతువులపట్ల మరింత మానవీయంగా ప్రవర్తించడం,ఈస్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం అవసరం,అనివార్యం. •

## సర్వేలకు అందని ఫలితాలతో పార్టీల్లో అయోమయం



సుంకవల్లి సత్తిరాజు

ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో అనూహ్యమైన, సర్వేలకందని ఫలితాలు వెలువడ్డాయి. అనుభవజ్ఞులైన విశ్లేషకులు కూడా ప్రజల నాడిని కనిపెట్టలేక చతికిలబడ్డారు. హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా పశ్చిమ బెంగాల్లో తనదైన ముద్ర వేసుకుని కేంద్ర ప్రభుత్వాన్ని సవాల్ చేసి,మోడీని సైతం ఎదురించి నిలబడగలిగిందనే పేరు గడించిన మమతా బెనర్జీ ఈసారిఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌ను గెలిపించలేకపోయారు. నాలుగో పర్యాయం బెంగాల్‌ను అధికారంలోకి తెస్తుందని అంతా ఊహించారు. కొన్నిసర్వేలు దీదీ దే విజయమని తేల్చగా,మరికొన్ని ఎగ్జిట్ పోల్ సర్వేలు ఈసారి భాజపా బెంగాల్‌లో పాగా వేయబోతుందని తేల్చి చెప్పాయి. ఇంకొన్ని పోస్ట్‌పోల్ సర్వేలు తృణమూల్ బిజెపిల మధ్య హోరాహోరీ పోటీ సాగిందని, గెలుపు ఇరుపక్షాల మధ్య దోబూచులాడుతుందని జోస్యం చెప్పాయి. ఈ ఎన్నికల్లో గెలిచి తీరాలన్న పట్టుదలతో బిజెపి తరపున విస్తృతంగా ప్రచారం చేసిన ప్రధాన మంత్రి మోడీ,హోంమంత్రి అమిత్ షాలు పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ గెలవకూడదని ఓటర్లకు బ్రెయిన్ వాష్ చేసారు. ఇతర రాష్ట్రాల ముఖ్య మంత్రులు,పలువురు కేంద్ర మంత్రులు బిజెపి తరపున ఎన్నికల ప్రచారం చేయడంజరిగింది. ఎన్నికలముందు ఆరోపణలు ప్రత్యారోపణలతో రణరంగాన్ని తలపించేలా ప్రచారాస్త్రాలు సంధించిన ఇరు పక్షాలు ఎన్నికల తర్వాత కూడా తమ కార్యకర్తల మనోధైర్యం చెక్కు చెదరకుండా వ్యూహ, ప్రతివ్యూహాలను ప్రదర్శించాయి. ప్రజాభిప్రాయం తమకే అనుకూలమని ధీమా ప్రదర్శించాయి. ఆటగాళ్ల ఎంత పోటుగాళ్లయినా ఆటలో గెలిచేది ఒకరే. మమతా బెనర్జీ 15సంవత్సరాల ఏకచ్ఛత్రాధిపత్యానికి బిజెపి గండి కొట్టి, బెంగాల్ గడ్డపై తొలిసారి కాషాయ జెండా ఎగరేసింది. ఈ విజయం బిజెపిని ఆనందోత్సాహంలో ముంచెత్తింది. ఇటీవల 'సర్'పై పశ్చిమ బెంగాల్‌లో వివాదం చెలరేగింది. 90లక్షల పైగా ఓటర్లను తొలగించడం వలన 130 నియోజకవర్గాల్లో తృణమూల్ అపజయం పాలైనదని చేస్తున్న ఆరోపణ బిజెపి భారీ విజయంలో కొట్టుకుపోయింది. తమిళనాడులో కూడా 50లక్షల ఓట్లు తొలగించారనే ఆరోపణలున్నా, అక్కడ ఎన్డీయే విజయం సాధించలేకపోవడాన్ని గమనించాలి.అన్ని సర్వేలు డిఎంకె విజయం ఖాయమని చెప్పినా కేవలం యాక్సెస్ మై ఇండియా సర్వే మాత్రం విజయ్ సారథ్యంలోని టి.వి.కె విజయం సాధిస్తుందని చెప్పింది. ఇప్పుడు ఈ సర్వే అంచనాలు నిజమైనాయి. స్టాలిన్ ఆధ్వర్యంలోని డి.ఎం.కె ను మూడవ స్థానంలోకి నెట్టి టివికె అద్భుతమైన ఫలితాలు సాధించడం విశేషం. ఇటీవలి కాలంలో విజయ్ పై అనేక ఆరోపణలొచ్చాయి. వీటినన్నింటినీ అధిగమించి, కేవలం 20,30 స్థానాలకే టివికె పరిమితమన్న అధిక శాతం సర్వేల అంచనాలను తోసిపుచ్చి, తమిళనాట సరికొత్త రాజకీయ పరిణామాలకు విజయ్ నాంది పలికారు. అశేషమైన ప్రజాభిమానమున్న



రజనీకాంత్ రాజకీయాల్లోకి రాకుండా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసారు. విజయకాంత్, కమల్ హాసన్ రాజకీయాల్లో రాణించలేకపోయారు. జయలలిత మరణంతో అన్నాడి.ఎంకెలో నిరుత్సాహం ఆవహించింది. ఆ పార్టీ బిజెపితో అలయన్స్ పెట్టుకుని ప్రతిపక్ష పాత్రకు పరిమితమైనది.ఇప్పుడు విజయ్ సారథ్యంలో టివికె అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్‌లా విజృంభించి, పార్టీ పెట్టిన కొద్ది కాలంలోనే తమిళనాట ఎన్నికల్లో అతి పెద్దపార్టీగా టివికెను నిలబెట్టారు.ఇకఅస్సాంలో ఈసారి 85శాతం పోలింగ్ నమోదైంది. 126 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ విజయం సాధించింది. ఇక్కడ భారతీయ జనతా పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించడం గమనార్హం. గత ఎన్నికల్లో పేలవమైన ప్రదర్శన కనబరిచిన కాంగ్రెస్ ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని తీవ్రంగా ప్రయత్నించినా నిరాశ మాత్రమేమిగిలింది. కేరళంలో పినరయి విజయ్ నేతృత్వంలోని ఎల్.డి.ఎఫ్ ఘోర ఓటమి పాలై, కాంగ్రెస్ నేతృత్వంలోని యు.డి.ఎఫ్ పగ్గాలు చేపడుతున్నది. కేరళంలో ఎల్డీఎఫ్ ఓటమి కమ్యూనిస్టులకు శరాఘాతంలా మారింది. ఈ ఓటమితో కమ్యూనిస్టు పార్టీలు దేశంలో ఎక్కడా ఉనికిలో లేకుండా పోవడం విచారకరం. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి కూడా ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. 2029 సార్వత్రిక ఎన్నికలపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి తీవ్రస్థాయిలో మేధోమథనం జరపాలి.తమ కూటమిలోని అసమ్మతిని తొలగించి, ఐక్యమత్యంగా ముందుకు సాగాలి. పుదుచ్చేరి కూడా ఎన్డీయే నిలబెట్టుకుంది.బిజెపి ప్రవచిత మెజారిటీ నినాదం ఎన్నికల్లో సత్ఫలితాలనివ్వడమేకాకుండా, ప్రతిపక్ష పార్టీలు కుహనా లౌకిక వాదంతో మెజారిటీ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని చెప్పడం ద్వారా పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రంలో బిజెపి విజయం సాధించిందని విశ్లేషకుల భావన. బెంగాల్‌లో దీదీ బంగ్లాదేశ్ చొరబాటుదారులకు ప్రోత్సాహమిస్తున్నదని బిజెపినేతలు చేసిన ప్రచారం, మమత అతి విశ్వాసం, అర్థంలేని దూకుడు, దుందుడుకు తనం తృణమూల్ అపజయానికి కారణమనిపలువురు భావిస్తున్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో భారీగా నమోదైన ఓట్లశాతం అక్కడి ప్రభుత్వాలపై ఏర్పడిన వ్యతిరేకత వలనే అని ఊహించలేక, తామే తిరిగి అధికారంలోకి వస్తామని ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హడావిడిచేసి, భంగపడ్డారు. ఏది ఏమైనప్పటికీ మినీ సార్వత్రిక ఎన్నికల్లా సాగిన రాజకీయ పోరు ఫలితాల ప్రకటనతో ముగిస్తుందని చెప్పలేం.సర్ వివాదం, ఇవియంల గొడవ అలాగో ఉండనే ఉంది. గెలిచిన రాజకీయ పక్షాలు విజయాన్ని తమ గొప్పగా చెప్పుకుంటుంటే, ఓడిన పక్షాలు ఏవో సాకులు చెప్పి ప్రజలను తప్పుదారి పట్టించడం రాజకీయ ప్రహసనంలో సర్వసాధారణమే. ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత కూడా రాజకీయ పక్షాల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఏర్పడింది.రాజకీయ పార్టీల మధ్య నిరంతరం కక్షలు, కార్పణ్యాలు రావణకాష్ఠంలా రగులుతూనే ఉంటున్నాయి. ప్రజల మధ్యకూడా రాజకీయాల కారణంగా స్పష్టమైన విభజన రేఖ ఏర్పడింది. ఇలాంటి పరిస్థితులుపోవాలి. రాజకీయాల్లో క్రీడాస్ఫూర్తి నెలకొనాలి. రాజకీయాల్లో గెలుపోటములు సహజం, సర్వ సాధారణం.అయితే గెలుపును ఆనందంగా ఆస్వాదిస్తున్న రాజకీయనేతలు ఓటమినిమాత్రం స్వీకరించలేని బలహీనత కలిగిఉండడం బాధాకరం.రాజకీయాల్లోశాశ్వతమిత్రులు, శాశ్వత శత్రువులంటూ ఎవరూఉండరు. రాజకీయాల్లో ఆత్మహత్యలే తప్ప హత్యలుండవనే నానుడి వాస్తవం. రాజకీయాల్లో విమర్శనాత్మక దృక్పథం ఆవశ్యకం. సద్విమర్శలు స్వీకరించని రాజకీయ పక్షాలు అంతర్ధానంకాక తప్పవు. •

## ప్రజావాక్కు

### విజయ్ గెలుపు..కమలం మెరుపు

రెండువేల ఇరవైఆరులో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో కీలకం కానున్నాయి. తమిళనాడులోదశాబ్దాలుగా కొనసాగుతున్న అధికారంలో రెండు పార్టీల మార్పిడి సంప్రదాయానికి తెరపడింది. మూడో శక్తిగా అవతరించిన టీవీకే పార్టీ అధినేత, సినీ నటుడు విజయ్ అనూహ్యంగా అధికార పీఠాన్ని తక్కువ వ్యవధిలోనే కైవసం చేసుకోబోతున్నారు.అక్కడి ప్రధాన ప్రతిపక్షం బలహీన స్థితిలో ఉండగా దఫ దఫానికి అధికారం మార్చే సంప్రదాయాన్ని బద్దలు కొట్టి తిరిగి డీ ఎం కే నే పగ్గాలు చేపట్టగలదని పలువురు భావించారు. అయితే ఆ సంప్రదాయం కొనసాగింది కానీవిజేతగా కొత్త ముఖం, కొత్త పార్టీ విజయ్ అవతరించారు.ఇక పశ్చిమ బెంగాల్‌లో హోరాహోరీ పోరు గత మూడేళ్లుగానే మొదలైంది. నాలుగోసారి ముఖ్యమంత్రి పదవి ఆశించిన మమత, బలమైన బీజేపీచేతిలో పరాజయం పాలైంది.ప్రచారంలో అక్కడి సమస్యలు,పరిష్కారాల కన్నా భావోద్వేగాలే ప్రధానంగా మారాయి.

- డా. డి.వి.జి.శంకర రావు,విజయనగరం

### చెత్తని నివారిద్దాం

పట్టణాలలో, గ్రామాలలో నిరంతరం ప్రయాణిస్తూ రోడ్ పైన ఎక్కడబడితే నిరుపయోగమైన ప్లాస్టిక్ కవర్లు, తినుబండారాలు, తడి చెత్తపొడి చెత్త వేస్తుంటాం. దీనివలన దానికి దగ్గరగా ఉన్న కుటుంబాలు అనారోగ్యాల పాలు అవుతూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నాం. కావున సిబ్బంది ఏర్పాటు చేసిన డస్ట్ బిన్ డబ్బాలలో మాత్రమే చెత్త వేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచి ప్రాణాలను కాపాడుదాం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### భూమి రికార్డులు లేవా?

రెవిన్యూ కార్యాలయంలో ప్రతి భూమిసర్వే నంబర్, విస్తీర్ణం, మ్యాపులుండాలి. ప్రభుత్వం ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కాలనీ వివరాలన్ని ఉండాలి.కానీ వరంగల్‌జిల్లాలో భూమి కబ్జాలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రెవిన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని ఖబ్జాలు చేసిన వారిని, అక్రమ నిర్మాణం చేసిన వారిని పట్టించుకోవడం లేదు. రెవిన్యూ అధికారులు రికార్డులులేవు అంటున్నారు. సాకులుచెప్పి రోజులు, నెలలు, సంవత్సరాలు నిర్లక్ష్యం చేస్తున్నారు.ముఖ్య మంత్రి జిల్లా కలెక్టర్‌కి ఆదేశాలు జారీ చేసి న్యాయం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### కృత్రిమమేధ అనివార్యం

ప్రపంచ సాంకేతిక రంగం వేగంగా మారుతున్న ఈ కాలంలో కృత్రిమ మేధస్సు వినియోగం అనివార్యంగామారింది. భారత దేశం ప్రపంచస్థాయిలో పోటీసామర్థ్యాన్ని నిలబెట్టుకోవాలంటే కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలను విస్తృత స్థాయిలో స్వీకరించడం అవసరం. అలాగే ఈకొత్త సాంకేతికతకు అనుగుణంగామానవ వనరులనునైపుణ్యాలతో తీర్చిదిద్దడం కూడా అత్యంత ముఖ్యమైన అంశం. కొంతమంది భావిస్తున్నట్లుగా కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్ సేవల రంగానికి ముప్పు కాదు. వాస్తవానికి అది ఉత్పాదకతనుపెంచే శక్తివంతమైన సాధనంగానిలుస్తోంది.క్లిష్టమైన సమస్యలను వేగంగా పరిష్కరించడం, కొత్త ఆవిష్కరణలకు దారితీయడం, పనితీరును మెరుగుపరచడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా సంస్థలు తమ వ్యాపార వ్యవస్థల్లో కృత్రిమ మేధస్సును విస్తృతంగా అనుసంధానిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కుటుంబ పాలనకు చరమగీతం

కమ్యూనిస్టులకు కాలంచెల్లిపోయింది. ఈ ఆధునిక యుగంలో భారతదేశంలో అత్యంత పేదవారు అత్యంత ధనికులు మధ్య వైరం అప్పట్లో ఉండేవిధంగా ఇప్పుడులేదు. అంతరాలు బాగా తగ్గాయి.ఇదంతా ఇంగ్లీష్ చదువులవల్లే సాధ్యమైంది. కుటుంబ పాలనకు ప్రజాస్వామ్యంలో ప్రజలు చరమగీతం పాడేశారు.అంతకంటే కొంచెం వెనక్కి వెళ్లి సనాతన భావజాలన్నీ, ఛాందస భావజాలాన్ని తెరమీదకు తీసుకువచ్చారు. భారతీయ జనతాపార్టీ నాయకులు వీటి పునాదుల. హైటవర్స్‌గా లేపగలిగారు. తమిళనాడులో సినిమా వాళ్లకు ఉన్న క్రేజ్ ఇంకెవరికి ఉండదు.తమిళనాడు వాళ్లు ఐదేళ్లకొకసారి అధికార పార్టీని మారుస్తారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంతజాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈ కోర్టు కేసులో ఫోరంలో కేసు వేసినచో 90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీ ఇప్పుడు మూడు నాలుగుసంవత్సరాలు గడిచినకానీ కేసు పరిష్కారం జరగటంలేదు కానీ కేసు బాధితులుమాత్రం కోర్టు చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. అన్ని కేసుల వైపు కాకుండా వినియోగదారు ఫోరంలో తక్షణమే ఆధారాలతోయుక్తంగా ఉంటే వెంటనే పరిష్కారం తీర్పు వెలబడును. వినియోగదారుల ఫోరంలో జాబ్స్ వెంటేనే భర్తీ చేయాలి.

-ఎస్. లక్ష్మీనారాయణ, కరీంనగర్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)


మంగళవారం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జి.చిన్నారెడ్డి

# సిఎం ప్రజావాణిలో 379 దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట), మే 5,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 219వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 379 దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 103 దరఖాస్తులు, రెవెన్యూశాఖకు సంబంధించి 66 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 105 దరఖాస్తులు, ప్రవాసీప్రజావాణీకి 2దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 103దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణీ ఇంచార్జ్ ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్ సూర్యప్రకాష్,ఏసీపీ ఉమేందర్, ప్రవాసీ ప్రజావాణీ సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 11 నుంచి పిఎంశ్రీ స్కూల్స్‌లో సమ్మర్ క్యాంప్‌లు

## పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే5:** రాష్ట్రంలో కొన సాగుతున్న పీఎంశ్రీ పాఠశాలల్లో వేసవి శిబిరాలను(సమ్మర్ క్యాంప్) నిర్వహించాలని పాఠశాల విద్యశాఖ నిర్ణయించింది. ఈ నెల 11 నుంచి 25 రాష్ట్రంలో కొనసాగుతున్న 533 పీఎంశ్రీ స్కూల్స్ లో సమ్మర్ క్యాంప్‌లను కొనసాగించాలని పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ సంవత్సరం కూడా ఈ నెల 11 నుండి 25 మే వరకు పీఎంశ్రీ పాఠశాలల్లో వేసవి శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్రంలోని జిల్లా విద్యాధికారులందరికీ తెలియజేశారు. సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించడానికి రూ. 2,66,50,000లను మంజూరు చేశారు. వేసవి శిబిరాల్లో పీఎంశ్రీ పాఠశాలలయేతర విద్యార్థులు కూడా చేరవచ్చని డైరక్టర్ సూచించారు. జిల్లా విద్యా అధికారులు (డీఈవో) అందరూ వేసవి శిబిరాల నిర్వహణ కోసం సంబంధిత ప్రధానోపాధ్యాయులకు బడ్జెట్‌ను విడుదల చేయాలని, ప్రతి శిబిరానికి సెక్టోరల్ అధికారులు, ఎంఈవోలను నియమించి, ప్రతిరోజూ క్రమం తప్పకుండా పర్యవేక్షి స్తూ, శిబిరాల సరైన అమలును పర్య వేక్షించి నివేదికను సమర్పించాలని

# సిపిఎస్‌పై ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలి

## తమిళనాడు, కేరళ ఎన్నికల తీర్పే దిక్సూచి

## ప్రభుత్వానికి టిఎస్‌సీపీఎస్‌ఈయూ డిమాండ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే5ః** సిపిఎస్ రద్దుపై తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సీపీఎస్ ఈయూ) డిమాండ్ చేసింది.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ ఉద్యోగుల ఆవేదనను, వారి సామాజిక భద్రతకు ఉన్న ప్రాముఖ్యతను చాటి చెప్పాయని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ అన్నారు. సోమవారం వెలు వడిన ఫలితాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ, కేరళ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)సాధించిన అద్భుత విజయం వెనుక ఆ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన 'సిపిఎస్ రద్దు పాత పెన్షన్ పునరుద్ధరణ' హామీ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ తమిళనాడు వ్యాప్తంగా సుమారు 110 నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో టీవీకే అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యం కనబరిచారని, ముఖ్యంగా 10 వేల లోపు ఓట్ల మెజారిటీతో ఆ పార్టీ గెలుపొందిన 15 నుండి 20 నియోజకవర్గాల్లో, 5 వేల లోపు ఓట్ల మెజారిటీతో 4, 2వేల రెండు వేల లోపు మెజారితో ఐదింటిలో, కేరళలో దాదాపు 18 నియోజకవర్గాల్లో 5000 లోపు ఓట్ల మెజారిటీతో ఉద్యోగుల పోస్టల్ ఓట్లే .. గెలుపు గుర్రాలుగా నిలిచాయన్నారు. తమిళనాడు మాజీ సీఎం ఎంకె స్టాలిన్ నియోజకవర్గం కొలత్తూరు వంటి కీలక స్థానాల్లో కూడా ప్రభుత్వ ఉద్యోగులు మార్పు వైపు మొగ్గు చూపారన్నారు. ఇది ఒక పార్టీ విజయం కాదని, తమ వృద్ధాప్య భద్రత కోసం ఉద్యోగులు ఇచ్చిన తీర్పని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్న పాత పెన్షన్ విధానాన్ని గమనించి, ప్రభుత్వాలు ఉద్యోగుల ఆవేదనలను నిర్లక్ష్యం చేయకుండా, తక్షణమే సిపీఎస్ రద్దుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఇంటర్ అడ్మిషన్ తాత్కాలిక నిలుపుదల

## సవరించిన షెడ్యూల్ త్వరలోనే జారీ: బోర్డు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 5:** తెలంగాణ రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం జారీ చేసిన ఇంటర్ అడ్మిషన్ షెడ్యూల్‌ను తాత్కాలికంగా నిలుపదల చేశారు. కొన్ని ప్రతిపాదిత సంస్కరణల దృష్ట్యా, ఈ సర్క్యులర్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన సూచనలతో త్వరలో అడ్మిషన్ షెడ్యూల్ జారీ చేయబడుతుందని ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో అడ్మిషన్లను ఈ నెల 8 నుంచి ప్రారంభించడానికి షెడ్యూల్‌ను సోమవారం జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 31 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు అడ్మిషన్ల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ సోమవారం విడుదల చేశారు. తరగతులను జూన్ 1నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను జూన్ 30నాటికి ముగించాలని సూచించారు. సోమవారం జారీ చేసిన షెడ్యూల్‌ను అభయన్స్‌లో పెట్టినట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ప్రిన్సిపాల్స్‌కి ఇంటర్ బోర్డు లేఖలు రాసింది.


మంగళవారం నిర్వహించిన ధర్నాలో అభివాదం చేస్తున్న బిపిటియంయం నేతలు

# హామీలను తక్షణమే అమలు చేయాలి

## బిపిటిఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 5, ప్రభాతవార్త:** ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బిపిటి యంయం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి రవిశంకర్ మాట్లాడుతూ ప్రైవేట్ రవాణా కార్మికుల కొరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం వలన ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతిని, తమ కుటుంబాలను పోషించుకోలేక, ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లకు ఏటా 12వేలు ఇస్తామని చెప్పి, ఆటో లైసెన్స్‌లనే ఎత్తివేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.పెంటయ్యగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు జరగటం మొదటిసారని, అవి డ్రైవర్ల ఆత్మహత్యలు కాదని, ప్రభుత్వ హత్యలను ఆరోపించారు. తక్షణమే ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ సంఘాలను చర్చలకు పిలిచి, సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం అన్ని సంఘాలను కలుపుకుని, రాష్ట్రంలో రవాణా బంద్ చేస్తామని హెచ్చరించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో బిపిటి యంయం ఉపాధ్యక్షులు గీతా సోనీ, టిఎస్‌పిటి యంయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.శ్రీధర్‌రెడ్డి, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చింతల నందకిషోర్, టిఎస్‌పిటియంయం రాష్ట్ర అధ్యక్షులు లిఖిత్‌కుమార్, ఉపాధ్యక్షులు హబీబ్, క్యాబ్ యూనియన్ నాయకులు సంతోష్, మీనా, గ్రేటర్ ఆటో యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అశ్విన్ రాజు, మినీ గూడ్స్ వెహికిల్ యూనియన్ నాయకులు, స్కూల్ వ్యాన్ డ్రైవర్స్ యూనియన్, స్కూల్ బస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం సిబిఐ విచారణపై స్పష్టత ఇవ్వాలి

## ప్రధాని మోడీని డిమాండ్ చేసిన పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

## కెసిఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదో బండి సంజయ్ చెప్పాలి



మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మహేష్ గౌడ్

**హైదరాబాద్,మే 5,ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ వచ్చే లోపు మే10 లోగా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సిబిఐ విచారణ చేపడ తారా? లేదా? అనేది స్పష్టత ఇవ్వాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ మమతబెనర్జీ, కేజ్రీవాల్ మీద కేసులు పెట్టిన కేంద్ర ప్రభుత్వం కెసిఆర్ మీద ఎందుకు పెట్టడంలేదనీ ప్రశ్నించారు. బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే విషయం మర్చిపోయి మాట్లాడుతున్నారనీ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో వేలకోట్ల అవినీతి జరిగిందని చెప్పాము దర్యాప్తు జరపాలని సిబిఐ విచారణ కోరుతూ సిబిఐ లేఖరాశాము అని ఆయన గుర్తుచేశారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ అవినీతి మేడిగడ్డ కుం గుబాటు, సుందిళ్ళ,అన్నారం బుంగలు పడటం పంపుహౌజ్‌లు ముంపుకు గురవడం వంటి అం శాలపై సిబిఐ విచారణ ఎందుకు చేయడం లేదో బండి సంజయ్ సమాధానం చెప్పాలనీ ఆయన ప్రశ్నించారు.ఎన్నికల ముందు కాళేశ్వరంలో అవినీతి జరిగిందని బిజెపి నేతలు చెప్పారనీ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక సిబిఐ విచారణ చేయడంలేదనీ వాపోయారు. కాళేశ్వరం విషయంలో కెసిఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో బండి సంజయ్ చెప్పాలనీ ఆయన డిమాండ్ చేశారు. తుపాకీ మాభుజాల మీద పెట్టి బిఆర్ఎస్‌ను కాల్చాలని బండి సంజయ్ చూస్తున్నారనీ విమర్శించారు. బిజెపి వాళ్ళు తలుచుకుంటే రేపటి నుంచి సిబిఐ విచారణ చేయవచ్చు కానీ చేయరు ఎందుకంటే ఇక్కడ వారి బలంతో లోక్ సభలో ఎనిమిది సీట్లు గెలుపొందారని ఆరోపిం చారు. బిఆర్ఎస్ నేతల మద్దతు లేకుండా బిజెపి కి రాష్ట్రంలో 8సీట్లు వచ్చేవా అనే సందేహం ఆయన వ్యక్తపరిచారు. అసెంబ్లీ ఎన్నికలలో సిరిసిల్ల నియోజకవర్గంలో బిజెపికి 18వేల ఓట్లు పోలైనాయనీ లోక్‌సభఎన్నికలలో కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని సిరిసిల్లలో 72వేల ఓట్లు ఎలా బిజెపికి పడ్డాయని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ మద్దతు లేకుండా బిజెపికి ఓట్లు పడ్డాయా అని అని అడిగారు. హరీష్ రావు మద్దతు లేకుండా మెదక్‌లో బిజెపి ఎంపి సీటు గెలిచారా అని ఆయన అనుమానం వ్యక్తంచేశారు. బిజెపి గెలుపు కోసం ప్రయత్నం చేశారు కాబట్టి మీపై కాళేశ్వరం సిబిఐ విచారణచేయడం లేదనీ మహేష్ అభిప్రాయపడ్డారు. వరి వేస్తే ఉరి అన్నది మీరే కదా ఇవ్వాలా మీరు రైతుల కోసం ఏదో చేస్తున్నట్లు ముసలి కన్నీరు కారుస్తున్నారనీ దుయ్యబట్టారు. మా ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిందని, రైతుబంధు తరహాలో రైతు భరోసా ఇస్తున్నామని, అంతేకాదు సన్నాలకు క్వింటాల్‌కు ఐదు వందల చొప్పున బోనస్ ఇస్తుందనీ అని వివరించారు. మా ప్రభుత్వం మక్కలుకూడా కొంటుందనీ రైతులు ఎంతో సంతోషంగా విక్రయించుకొంటున్నారని ఆయన తెలిపారు. బెంగాల్‌లో బిజెపికి అనుకూల పరిస్థితులు లేవనీ అది కేవలం ఓటుచోరితో గెలిచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రత్యేక ఓటర్ల సవరణతో బెంగాల్‌లో 90లక్షల ఓట్లను కేంద్రంలోని బిజెపి పాలకులు తొలగించారనీ ఆరోపించారు.తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, ఓటును కాపాడుకోవాలని సూచించారు.

# గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా ఉపాధి



## ప్రతిరోజు 15లక్షల మంది కూలీలకు పనులు కల్పిస్తాం

## రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉపాధిహామీ పనుల్లో రోజుకు సుమారు 9 లక్షల మంది కూలీలు పాల్గొంటున్నారని, ఈ సంఖ్యను తక్షణం 15 లక్షలకు పెంచేలా సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని స్పష్టం చేశారు. అందుకు గ్రామాల్లో పనుల ప్రణాళికను వేగవంతం చేయడంతోపాటు అవసరమైన అనుమతులు, సాంకేతిక ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి మరిన్ని పనిదినాలు కల్పించాలన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సిఇఓలు, డిఆర్‌డిఓలు, డిపిఓలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, మిషన్ భగీరథ అధికారులతో మంత్రి సీతక్క మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, ఉపాదిహామి, సెర్ప్, ఇతర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను కేవలం అనుమతించిన పనులకే వినియోగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించిన ఘటనలపై సంబంధిత అధికారులు వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను అత్యవసరంగా చెల్లించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 1590కోట్ల మేర బకాయిలు ఉండటం ఆందోళనకరమని, వాటిని చెల్లించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఏప్రిల్, మే నెలలకు కేంద్రం మంజూరు చేసిన 6 కోట్ల పని దినాల్లో, ఏప్రిల్‌లో కోటిన్నర పనిదినాలు సాధించడం సానుకూలమని, మే నెలలో పూర్తి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. పనితీరు తక్కువగా ఉన్న జనగామ, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, ఖమ్మం జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షిం చాలని ఆదేశించారు. కూలీలకు వేతనాల చెల్లింపుల విషయంలో పురోగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. కేంద్రంతో సమన్వయం చేసుకోవడం ద్వారా రూ.462 కోట్ల నిధులు విడుదల చేయించామని, ఏప్రిల్ 15 వరకు బకాయి చెల్లింపులు పూర్తయ్యాయని చెప్పారు. పని స్థలాల్లో తాగునీరు, షెడ్లు, ఫస్ట్ ఎయిడ్ వంటి కనీస సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. సెర్ప్ కార్యక్రమాల కింద మహిళా భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి జిల్లా మహిళా సమాఖ్య భవనాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సుమారు 5వేల గ్రామీణ మహిళా భవనాల పను లను త్వరిత గతిన పూర్తి చేయాలని, అదేవిధంగా మహిళా సంఘాల కోసం నిర్మిస్తున్న 46 గోదా ముల నిర్మాణాన్ని విస్తరించాలని పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 1,900 గ్రామ పంచాయతీ భవనాలు, 1450 అంగన్‌వాడి కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికా రులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీ, మిషన్ భగీరథ ఈఎన్‌సి కృపాకర్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఇఎన్‌సి జోగారెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లలో రానున్న రెండువారాలు కీలకం

## వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలి

## క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పర్యటించాలి

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలు



**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లలో వేగ పెంచాలని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టిఫెన్ రవింద్ర ఆదేశించారు. ధాన్యం సేకరణ తక్కువగా ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఆయా జిల్లాల ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు. రానున్న రెండు వారాలు యుద్ధ ప్రాతిపదికన పని చేసి ధాన్యం కొనుగోలును విజయవంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ధాన్యం సేకరణలో భాగస్వాములైన ప్రతీ ఒక్క అధికారి, సిబ్బంది, మిల్లర్‌పై ఉందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని, ధాన్యం అమ్మిన రైతులకు జాప్యం లేకుండా చెల్లింపులు చేయాలన్నారు. తూకం, రవాణా, హమాలి, మిల్లుల వద్ద ఆన్ లోడింగ్ ఈప్రక్రియలన్నీ వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు మంగళవారం నల్గొండ జిల్లాలో ధాన్యం సేకరణను పరిశీలించి వచ్చిన అనంతరం రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల సరళిపై ఆయన సమీక్షించి ఆదేశాలు జారి చేశారు. ధాన్యం సేకరణలో సమస్యలను గుర్తించి పరిష్కరించడంతోపాటు సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు, అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రైతులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు వడదెబ్బకు గురికాకుండా టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వాహనాల కేటాయింపును ఎప్పటికప్పుడు సమకూర్చాలని, ప్రతీ రోజు వాహనాలను అవసరమున్న చోటుకు తరలించేలా రవాణాశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అదనపు వాహనాలను సిద్ధంగా ఉంచుకొని ఎక్కడ అవసరముంటే అక్కడకు పంపించాలని సూచించారు.ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి ధాన్యం సేకరణ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన టార్పాలిన్లు సమకూర్చిందని, అంతేకాకుండా మిల్లర్ల చార్జీలు కూడా చెల్లించిందని ఆయన స్పష్టం చేశారు. బాయిల్డ్ రైస్ టార్గెట్ అడ్వాన్స్‌గా ఇచ్చామని తెలిపారు. గన్ని బ్యాగుల కొరత లేకుండా 11 కోట్ల కొత్త గన్ని బ్యాగులు తీసుకొచ్చామని వివరించారు. ఈ నేపథ్యంలో మిల్లర్లు ధాన్యం సేకరణలో పూర్తి సహకారం అందించాలని, మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని నిర్దేశించారు

# బిఆర్ఎస్ అవినీతిపై సిబిఐ విచారణకు ముందుకు రాని బిజెపి

## రేవంత్‌రెడ్డి గేమ్ ఛేంజర్, ఆయన పాపులారిటీ పెరుగుతూనే ఉంటుంది

## కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,మే 5,ప్రభాతవార్త:** బిజెపికి అవయవదానం చేసిన బిఆర్ఎస్ అవినీతిపై సిబిఐ విచారణకు బిజెపి ముందుకు రావడానికి జంకుతోందని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ మోడీ పర్యటన లోగా సిబిఐతో బిఆర్ఎస్ పాలనలో జరిగిన అనేక అవినీతి అంశాలను సిబిఐతో విచారణ జరిపిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు, భద్రాద్రి,యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాల్లో చోటు చేసుకున్న అవకతవకలపై జస్టిస్ మదన్ బీ లోకూర్ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సిబిఐ విచారణకు ఆదేశిస్తే ఎందుకు సిబిఐ విచారణ ప్రారంభించలేదనీ ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు బిజెపి ద్వంద్వ విధానం చూస్తున్నారనీ, సిబిఐ విచారణ కేంద్రం ఎందుకు చేయడం లేదో కూడా వారికి తెలుసని ఆయన అన్నారు.తెలంగాణలో బిజెపి 8 ఎంపిలు గెలవడంలో బిఆర్ఎస్ పాత్ర ఉందనీ ఆయన ఆరోపించారు. సిరిసిల్లలో అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి 18 వేల ఓట్లు వస్తే లోక్ సభ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్‌కు సిరిసిల్లలో 70 వేల ఓట్లు వచ్చాయనీ ఇదే వారి మధ్య ఉన్న సంబంధమని ఆయన ఆరోపించారు. బండి సంజయ్‌కి రేవంత్ రెడ్డిపై కోపం వున్నా,రేవంత్ రెడ్డి పాపులారిటీ పెంచుకోవద్దు అని ఉన్నా మాకు ఇబ్బంది ఏం లేదు రేవంత్ రెడ్డిగేమ్ ఛేంజరా? కాదా అనే విషయం బండి సంజయ్‌కు తెలియాలనీ హితవు చెప్పారు. రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షుడుగా,బండి సంజయ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా ఉంటే బండి సంజయ్ చేయలేని పని రేవంత్ రెడ్డి చేసి చూపించారనీ అన్నారు. రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్యక్షుడుగా బిఆర్ఎస్ పార్టీని రాష్ట్రంలో గద్దె దించారనీ చెప్పారు.అది గేమ్ ఛేంజర్ అంటే అని అన్నారు. రేవంత్ రెడ్డి స్టార్ క్యాంపైనర్‌గా కేరళలో మాత్రమే ప్రచారం చేశారు.మిగిలిన అస్సాం,వెస్ట్ బెంగాల్,పుదుచ్చేరి,తమిళనాడు వెళ్ళలేదనీ అన్నారు. సెప్టెంబర్1వ తేదీ 2025న కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందనీ, ఇప్పటి వరకు సిబిఐ విచారణ ఎందుకు స్టార్ట్ చేయలేదు బండి సంజయ్‌వివరణ ఇవ్వాలనికోరారు. సిబిఐకు అప్పగిస్తే 48 గంటల్లో తాడో పేడో తెలిస్తామని కిషన్ రెడ్డి అన్నారు ఏమైంది? అని అడిగారు. మోడీ తెలంగాణ పర్యటనకు వచ్చే 10వ తేదీలోగా తెలంగాణలో బిఆర్ఎస్ అవినీతిపై సిబిఐ విచారణ మొదలుపెట్టి మీ చిత్తశుద్ధిని నిరూపించుకోండనీ సవాల్ విసిరారు.

# 24, 25న తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర మహాసభలు

## ఆహ్వాన సంఘం ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ కోదండరామ్ ఎన్నిక

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 5ః** తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలను ఈ నెల 24, 25 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. టిపిఎన్‌ఎం రాష్ట్ర మహా సభల ఆహ్వాన సంఘం ఛైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ గడిచిన గత చరిత్రలో నాటక, సినీ రంగాలలో స్థిరపడ్డ అనేకమంది కళాకారులు, నటులు, దర్శకులు తెలంగాణ ప్రజానాట్య మండలి నుండి ఎదిగినవారేనని తెలిపారు. భూస్వామ్య ఆధిపత్యాన్ని తట్టుకోలేక పోరాడిన కాలంలో వాళ్ల పోరాటానికి ప్రజానాట్యమండలి ఊపిరిని పోసిందన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి సాంస్కృతిక ఉద్యమమే శరణ్యమని ఆనాడు ఆంధ్ర మహాసభ నిర్ణయం తీసుకున్నదన్నారు. అమెరికా లాంటి దేశాలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని చూసిన తరుణంలో ఇరాన్‌పై ఇతర దేశాలపై అనేక దాడులను నిర్వహిస్తున్నారని, అలాంటి యుద్ధాల వలన అనేక సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారన్నారు. రాజకీయం అంటే కేవలం డబ్బు, మందు మయంగా మారిందని, ఇలాంటి దుర్భరమైన పరిస్థితులలో ప్రజల్లో సాంస్కృతిక ఉద్యమం మళ్ళీ అనివార్యంగా మారిందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, టిపిఎన్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఆఫీస్ బేరర్స్ కే. లక్ష్మీనారాయణ, కే. ఉప్పలయ్య, పడాల నళిని, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్ర మోహన్ గౌడ్, నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేసే కుట్రను మానుకోవాలి

## మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుంటాం, జూన్‌లో హైదరాబాద్ ముట్టడి

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, విద్యార్థి సంఘాల హెచ్చరిక



**హైదరాబాద్, మే 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చి, దాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. గత 30 నెలలుగా బడ్జెట్ విడుదల చేయకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని నేతలు ఆరోపించారు. బడ్జెట్ కొరత అనేది కేవలం ఒక సాకు మాత్రమేనని, 6లక్షల కోట్ల ఆదాయం మరియు 3.60లక్షల కోట్ల అప్పులు తెచ్చిన ప్రభుత్వం, 14 లక్షల మంది విద్యార్థుల కోసం 8 వేల కోట్లు విడుదల చేయడానికి ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు చెల్లిస్తున్న సర్కారుకు, పేద విద్యార్థుల చదువుపై పట్టింపు లేదని విమర్శించారు. జీవో నంబర్ 7 ద్వారా ఫీజులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో వేస్తామనడం పథకాన్ని అటకెక్కించే ప్రయత్నమేనని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వం బకాయిలతో తమకు సంబంధం లేదని కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం దారుణమని అన్నారు.ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు. మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనలను అడ్డుకోవడం, ఘెరావ్ చేయడం, జూన్ చివరి వారంలో 5 లక్షల మందితో హైదరాబాద్ ముట్టడి ఉంటుందని హెచ్చరించారు. అవసరమైతే జూలైలో సీఎం నివాసం ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. వెంటనే పాత బకాయిలను విడుదల చేసి, డీబీటీ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

